# సేంద్రియ వ్యవసాయం చేయాలి



పెంచికల్‌పేట్: సమావేశంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ

- జన్ జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా రైతు సంఘాల ఏర్పాటు
- పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు

పెంచికల్‌పేట్, నవంబర్ 20: రైతులు సేంద్రియ వ్యవసాయ సాగుకు కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి శాఖ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని చేడ్వాయి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి రావూరి శ్రీనివాసరావుతో కలిసి జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సహజ వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని, యాసంగి పంటలకు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. వరి,పత్తి,మొక్కజొన్న, మిరపపంటలో ఆశించే చీడ పీడల వంటి వాటిపై యాజమాన్యంపై పంట మార్పిడి చేపట్టే విధానంపై, పచ్చి రొట్ట సాగుపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతపై రైతులు దృష్టి సారించాలని, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పంటల మార్పు విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో భూసార పరీక్షలు చేసుకొని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు విత్తనాలు పురుగు మందులు వాడుకోవాలన్నారు. పంటల సస్యరక్షణకు అధికారులను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు శాంతి ప్రియ, మండల వ్యవసాయాధికారి రాజులనాయుడు, షణ్ముఖ అగ్రిటెక్ మేనేజర్ స్వామి, మండల విస్తరణ అధికారులు లావణ్య ,శ్రీవిద్య, గౌసయ బేగం, రైతులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వాంకిడి: గాయత్రి జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు

వాంకిడి, నవంబర్ 20 : మండల కేంద్రంలోని గాయత్రి,మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డులోని ఆర్‌బీ జిన్నింగ్ మిల్లుల్లో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన పత్తిని దళారులకు విక్రయించి మోసపోవద్దని, సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. క్వింటాల్‌కు రూ.7,020లు మద్దతు ధర ఇవ్వనున్నట్లు చెప్పారు. సుమారు 230 క్వింటాల పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జిన్నింగ్ మిల్లు యజమానులు గాదె ప్రవీణ్ కుమార్, బాడేసాబ్, సీసీఐ(సీపీవో) పన్నాలాల్, సీసీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కెరమెరి : గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి
- తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రచారం

కెరమెరి, నవంబర్ 20: బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని, మరోసారి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కి అండగా నిలవాలని ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు వివాదస్పద గ్రామాలతో పాటు కేలి(కే), కేలి(బి), కొలాంగూడ, నాయకపుగూడ, ఖైరి, ఇందాపూర్, దేవుడ్‌పల్లి, నిషాని గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవలక్ష్మికి డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోవలక్ష్మి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదరించి అభివృద్ధి చేసిందని, మరోసారి అవకాశం కల్పిస్తే సంక్షేమంతో పాటు గ్రామాలు అభివృద్ధి మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ మాయ మాటలను నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిపించాలని అన్నాభావుసాఠే మనుమడు సచినసాఠే సైతం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఫయాజ్, హకీం అన్సారి, శేషరావ్, బాలాజీ, షేక్ యూసుఫ్, యునూస్, ఉత్తం నాయక్, వెంకటేశ్, కుమ్రం భీంరావ్, ఇలాహి, దస్తగిర్, చందన్‌షా, ధర్ము, తిరుపతి, సంగ్రాం, అశోక్, శంకర్, సర్పంచులు కుమ్రం నాణేశ్వర్, నారాయణ, ఉపసర్పంచ్ సయ్యద్ రిజ్వాన్ పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కాగజ్‌నగర్ ఎస్పీయం కాలనీ, నవంబర్20: కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పోటీ పరీక్షలు, వివిధ రకాలైన పుస్తకాలను ప్రదర్శించారు. మధ్యాహ్నం ముగింపు కార్యక్రమం నిర్వహించి వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.రాజు, అధ్యాపకులు జనార్దన్, ప్రేమ్ కుమార్, కోటేశ్, సంతోష్, శరత్ చంద్ర, లింగమూర్తి, డా.టేమాజి, శారద, కృష్ణవేణి ,నాన్ టీచింగ్ సిబ్బంది, కళాశాల గ్రంథాలయ అధికారి దత్తాత్రేయ పాల్గొన్నారు.

## పథకాలపై అవగాహన

రెబ్బెన, నవంబర్ 20: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గోలేటి బ్రాంచ్ మేనేజర్ విశ్వప్రసాద్ అన్నారు. గోలేటి గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో గోలేటి బ్యాంచ్‌లో సోమవారం ఆర్థిక అక్షరాస్యత, వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సలుగు శ్రవణ్, క్యాషియర్ సురేశ్, బ్యాంక్ సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణలతో పాటు పలువురు ఉన్నారు.

# కొత్తగా.. కొంగొత్తగా..

- చకచకా సాగుతున్న సుందరీకరణ పనులు



మంచిర్యాలలోని లక్ష్మీటాకీసు చౌరస్తాలో అభివృద్ధి చేసిన జంక్షన్



జంక్షన్ రింగ్ మధ్యలో అమర్చిన బటర్‌ఫ్లై నమూనాలు

మంచిర్యాలటౌన్, నవంబర్ 20: సుందరీకరణ పనుల్లో భాగంగా మంచిర్యాల పట్టణంలోని ప్రధాన రహదారిపై రూ. నాలుగు కోట్లతో చేపడుతున్న నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఐబీ చౌరస్తా, వెంకటేశ్వర టాకీసు, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీటాకీసు చౌరస్తాలలో ఒక్కోచోట రూ. కోటి వెచ్చించి మొత్తం నాలుగు కోట్లతో ఈ జంక్షన్లను అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీటాకీసు చౌరస్తాలోని జంక్షన్‌లో అందమైన సీతాకోక చిలుకల బొమ్మలు, గ్రీనరీ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ వెలుగులతో ఇక్కడ రోడ్డు మధ్యలో జంక్షన్ రింగ్‌లో ఏర్పాటు చేసిన నాలుగు బటర్ ఫ్లైలు ఎంతో ఆకర్షిస్తున్నాయి. చూడచక్కనైన అందంతో జంక్షన్ చూపరులను ఆకట్టుకుంటోంది.దీంతో ఈ ప్రాంతమంతా కొత్త శోభను సంతరించుకుంది.

# కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా



కాగజ్‌నగర్: డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్, నవంబర్ 20: కాగజ్‌నగర్ పట్టణం పెట్రోల్ పంపు ఏరియాలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థులపై వేధింపులు వెంటనే ఆపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బస్సు ఫీజు, కళాశాల ఫీజుల పేరిట యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నదని డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థుల సంఘం నాయకులు మాట్లాడుతూ, స్కాలర్ షిప్ ఆధారంగానే విద్యనందిస్తామని ప్రచారం చేయడంతోనే కళాశాలలో అడ్మిషన్ పొందామని, ఇప్పుడు అదే యాజమాన్యం కళాశాలకు చెందిన బస్సుకు, కళాశాల ఫీజులు చెల్లించాలని వేధిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము విద్యా సంవత్సరం మధ్యలో ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. అంతే కాకుండా కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్న ఇంగ్లిష్ లెక్చరర్ శ్రీనివాస్‌ను అకారణంగా తొలగించారని, అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారని, అతని తీరు బాగా లేదని అతన్ని తొలగించి తెలంగాణ ప్రాంతానికి చెందిన అర్హుడిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా తాము ఫీజులు చెల్లించమన్న విషయం వాస్తవమే, ప్రస్తుతం సకాలంలో స్కాలర్‌షిప్‌లు మంజూరు కాకపోవడంతో వాహనాలకు డీజిల్ ఖర్చుల నిమిత్తం ఫీజులు చెల్లించమని కోరినట్లు స్పష్టం చేశారు. ఏ విద్యార్థిపై కూడా ఒత్తిడి చేయలేదన్నారు. దాదాపుగా 2గంటల పాటు ధర్నా అనంతరం ప్రిన్సిపాల్ ధర్నా చేస్తున్న విద్యార్థులను సముదాయించి 2రోజుల్లో యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేశ్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి దేశ పౌరులు

- ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 20: నేటి బాలలే రేపటి దేశ పౌరులని వారి హక్కులను కాపాడాలని జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలలే దేశ సంపద అని వారి హక్కులను వారికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పిల్లలు బడిలో ఉండాలి కానీ పనిలో ఉండకూడదని గుర్తుచేశారు. రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులను పిల్లలకి తెలియజేయాలన్నారు. పిల్లల హక్కులకు ఆటంకం కలిగితే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కి కాల్ చేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె చెప్పారు .పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొంటారన్నారు. అనంతరం మహిళా సాధికారికత కేంద్రం డీఎంసీ శారద మాట్లాడుతూ, విద్యార్థులు వారి హక్కులను తెలుసుకోవడం చాలా అవసరమని, బై స్టాండర్ ఇంటర్వెన్షన్, చైల్డ్ మ్యారేజ్, విద్య యొక్క ప్రాముఖ్యత , హెల్త్ , న్యూట్రిషన్ గురించి చెప్పారు. జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ, బేటీ బచావో బేటీ పడావో,జెండర్ డిస్క్రిమినేషన్, జెండర్ ఇక్వాలిటీ , పోక్సో యాక్ట్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ గురించి చెప్పారు. ఫైనాన్షియల్ లిటరసీ సాగర్ మాట్లాడుతూ, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలు ఫైనాన్షియల్ స్కీమ్స్, సుకన్య సమృద్ధి యోజన స్కీంల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.